క్లుప్తంగా

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని మద్ది జంక్షన్‌లో కొలువైన అభయాంజనేయ స్వామి ఆలయ 21వ వార్షికోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బుగత సత్యనారాయణ, బుగత శ్రీనివాసరావుతో పాటు టీడీపీ నాయకుడు కాళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొని అభయాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఐదు వేల మందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు. మద్ది, పద్మనాభం, తునిపాలెం, అర్జునిపాలెం గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా వెంకటరావు



బాధ్యతలు స్వీకరించిన వెంకటరావును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మధురవాడ: రాష్ట్రంలోనే అతిపెద్దదైన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా ములుగు వెంకటరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కొమరవోలు నుంచి బదిలీపై వచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు దాసరి నాగేశ్వరరావు, కొటాన శ్రీను, జి. ప్రకాశబాబు, గణేష్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనకు అభినందనలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన జి. రవి ఎఫ్ఏసీ హెచ్‌ఎంగా తన మాతృ పాఠశాల నర్సీపట్నం సమీపంలోని పెదబొడ్డేపల్లికి బదిలీ అయ్యారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

మధురవాడ: మారికవలస, మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు గ్రేస్ హ్యాపీనెస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ పోతల నవీన్‌కుమార్ సుమారు 100 మందికి బియ్యం, పప్పులు, నూనె తదితర నిత్యావసరాలను అందజేశారు. తమ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వీటిని పంపిణీ చేస్తున్నట్టు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

రేపటి నుంచి మరిడమ్మ ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు నమ్మివానిపేటలో మరిడమ్మ ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ఘనంగా జరగనున్నాయి. శ్రీవిద్యా శక్తి పీఠం వ్యవస్థాపకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి శర్మ ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు గురువారం మధ్యాహ్నం, ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన కార్యక్రమం ఉంటుందని జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం మాజీ అధ్యక్షుడు నమ్మి మాధవరావు తెలిపారు.

శిల్పారామంలో కూచిపూడి నృత్య విన్యాసాలు



కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పీఎం పాలెం: శిల్పారామంలోని కళావేదిక ఆదివారం సాయంత్రం కూచిపూడి నృత్యాలకు వేదికైంది. వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా నటరాజ కళాక్షేత్ర ఆధ్వర్యంలో ప్రముఖ కూచిపూడి నృత్య శిక్షకురాలు తులసి వద్ద శిక్షణ పొందిన బాల కళాకారులు తమ నృత్యాభినయంతో ప్రేక్షకులను ఎంతగానో అలరించారు. ప్రదర్శనలో జయశ్రీ, మౌనిక, మహతి, భావన, హారిక, ఆనయ, కల్పన, కీర్తిక, గ్రీష్మ తదితరులు పాల్గొన్నారు. స్థానిక పరిపాలన అధికారి నమేష్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

- తాగునీటి కోసం ఎదురు చూపులు
- కనీస అభివృద్ధికి నోచుకోని అంతరరహదారులు
- అందుబాటులో లేని డ్రైనేజీ సదుపాయం
- కాలనీలో క్షీణిస్తున్న పారిశుధ్యం





బింద్రానగర్ కాలనీలో మట్టి రోడ్డు

సమస్యల వలయంలో బింద్రానగర్ కాలనీ

పీఎం పాలెం: మహావిశాఖపట్నంలో భాగమైనప్పటికీ, జీవీఎంసీ 8వ వార్డులోని బింద్రానగర్ కాలనీ వాసులు కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 500 కుటుంబాలు నివసించే ఈ కాలనీతో పాటు మరో మూడు పేద, మధ్యతరగతి కాలనీల ప్రజలు కూడా ఇదే ప్రాంతంలో నివసిస్తున్నారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్థానికులు జీవీఎంసీ అధికారులను కోరుతున్నారు.



గతుకుల మయంగా జాతీయ రహదారినుంచి బింద్రానగర్‌కు వెళ్లే రోడ్డు

అధ్వాన రహదారులు, ప్రమాదాలు

జాతీయ రహదారి నుంచి కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారిలో అనేక చోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. రాత్రి వేళల్లో, ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. కాలనీలోని అంతర్గత రోడ్లలో అధిక శాతం మట్టి రోడ్లే కావడం వల్ల చిన్నపాటి వర్షం పడినా బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కొన్ని రోడ్లకైతే రెండు వైపులా తుప్పలు, డొంకలు పెరిగి నడకదారుల్లా మారిపోయాయి. ఈ రోడ్లలో పురుగులు, పాములు సంచరిస్తున్నాయని, రాత్రి వేళల్లో ప్రాణభయంతో ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి సమస్య

కాలనీకి రెండు రోజులకు ఒకసారి మాత్రమే జీవీఎంసీ తాగునీరు సరఫరా చేస్తోంది. కాలనీలో ఏర్పాటు చేసిన మంచినీటి బోర్లు కూడా సక్రమంగా పనిచేయడం లేదని, మరమ్మతులకు గురైన వాటిని తక్షణమే బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీకి ప్రతి రోజూ తాగునీటిని సరఫరా చేయాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు.



మూలకు చేరిన బోరు

వీధి దీపాల లేమి, పారిశుధ్య సమస్యలు



వెలగని వీధి లైటు

నూకాలమ్మ ఆలయ రహదారిలో చాలా కాలంగా వీధి దీపాలు వెలగడం లేదు. కాలనీ అంతటా వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో రోజురోజుకూ పారిశుధ్యం క్షీణిస్తోంది. మురుగునీరు పేరుకుపోయిన కాలువలలో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, దోమల నివారణకు జీవీఎంసీ సిబ్బంది తక్షణమే చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అంతర రహదారులను అభివృద్ధి చేయాలి



కాలనీలోని అంతర రహదారులు ఇప్పటికీ అధికశాతం మట్టి రోడ్లుగా ఉన్నాయి. వాటిని సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయాలి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్లపై ప్రయాణించడం దుర్భరంగా ఉంది. జాతీయ రహదారినుంచి కాలనీకి వచ్చే ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడిన గతుకులను తక్షణం పూడ్చాలి.

–వై. సత్యనారాయణ, బింద్రాగనర్,

పొంగి ప్రవహిస్తున్న మురుగు



కాలనీలో డ్రైనేజీ సదుపాయం లేనందున అనేక చోట్ల మురుగునీరు ప్రవహిస్తోంది. వర్షాలు కురుస్తున్నందున కాలనీలో మురుగు పొంగిప్రవహిస్తోంది. వీటి వలన కాలనీలో ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదముంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

–వీ.రామ సుబ్బయ్య, బింద్రానగర్

వాకింగ్ ట్రాక్ లేక ఇబ్బందులు



స్థానిక సుందరయ్య పార్కులో వాకింగ్ ట్రాక్ సదుపాయం లేకపోవడంతో సీనియర్ సిటిజన్స్ ఇబ్బంది పడుతున్నారు. రానున్నది వర్షా కాలం కావడంతో మరీ ఇబ్బంది పడవలసిన పరిస్థితి ఉంటుంది. జీవీఎంసీ అధికారులు, స్థానిక నేత లు స్పందించి త్వరితగతిని పా ర్కులో వాకింగ్ ట్రాక్ నిర్మించాలి.

–ఇ.గాంధీ, బింద్రానగర్



కాలనీలో డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో ప్రవహిస్తున్న మురుగునీరు

రేషన్ కష్టాలు మొదలు..



తలపై బియ్యం పట్టుకుని వలందపేట జాతీయ రహదారి దాటుతున్న మహిళలు



సరకులు అందిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మధురవాడ: కూటమి ప్రభుత్వం తీసుకున్న రేషన్ పంపిణీ విధాన మార్పు ప్రజలకు మళ్లీ అవస్థలు సృష్టిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్న రేషన్ డిపోల వద్ద ప్రజలు గంటల తరబడి వేచి ఉండి, అనేక ఇబ్బందుల కు గురవుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు అందించే విధానం ప్రజల మన్ననలు పొందింది. అయితే, కూటమి ప్రభుత్వం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మార్క్ పాలనను రద్దు చేసే పేరుతో ఈ విధానానికి స్వస్తి పలికి, రేషన్ డిపోల వద్ద నుంచే ఆదివారం నుంచి సరుకులు తీసుకోవాలని నిర్ణయించింది.

ఈ నూతన విధానాన్ని మధురవాడలోని వివిధ చోట్ల టీడీపీ నాయకులు ఆర్భాటంగా ప్రారంభించారు. అయితే, డిపోలకు దూరంగా ఉన్న కార్డుదారులు కిలోమీటర్ల మేర నడచి, లేదా వాహనాలపై వచ్చి సరుకులు తీసుకోవడం ప్రారంభించారు. పరదేశిపాలెం 401 డిపోకి బోరవానిపాలెం, డ్రైవర్స్ కాలనీ, బోయిపాలెం సమీపంలోని పీపీ1 కాలనీ వంటి ప్రాంతాల నుంచి ప్రజలు కిలోమీటరు పైగా దూరం ప్రయాణించి రావాల్సి వస్తోంది. మధురవాడలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి నెలకొంది, సరుకులు తీసుకున్న తర్వాత వాటిని అంత దూరం మోసుకువెళ్లడం ప్రజలకు భారంగా మారింది.మారికవలస ఆర్‌జీకే కాలనీ, మధురవాడ క్వారీ సొసైటీ డిపో వంటి చోట్ల భారీ క్యూలు దర్శనం ఇచ్చాయి. గతంలో ఇంటి వద్దకే సరుకులు వస్తుండటంతో వృద్ధులు, మహిళలు ఎంతో సౌకర్యంగా భావించారు. ఇప్పుడు డిపోలకు వచ్చి, గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి నెలకొనడంతో కార్డుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పాలన సాగిస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇలాంటి తిరోగమన నిర్ణయాలతో ప్రజలను మళ్లీ అవస్థల పాలు చేస్తోందని పలువురు విమర్శిస్తున్నారు.

ఎన్ని ఇబ్బందులో...

తగరపువలస: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ సరుకుల పంపిణీ విషయంలో మళ్లీ కష్టాలు ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డులోని వలందపేట ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు రేషన్ డిపోలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటా రేషన్ పంపిణీకి వాహనాలు ఏర్పాటు చేయగా, కూటమి ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. దీంతో ఆదివారం నుంచి మళ్లీ రేషన్ డిపోలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలని చెప్పడంతో వలందపేటకు చెందిన మహిళలు తలపై బియ్యం మూటలు పట్టుకుని, ప్రమాదకరమైన ఆరు వరుసల జాతీయ రహదారిని దాటుతూ కనిపించారు. 'కూటమి ప్రభుత్వం రాకతో తమకు మళ్లీ కష్టాలు ప్రారంభమయ్యాయి. ఇంటివద్దకే రేషన్ వచ్చేది, ఇప్పుడు దూరం వెళ్లి తెచ్చుకోవాలి, అది కూడా ఇంత పెద్ద రోడ్డు దాటుకుంటూ వెళ్లాలంటే భయమేస్తోంది' అని మహిళలు వాపోయారు.



పరదేశిపాలెం రేషన్ డిపోలో రేషన్ కోసం క్యూలో ఉన్న లబ్ధిదారులు

నిర్దేశించిన సమయాల్లో రేషన్ పంపిణీ

కొమ్మాది: ప్రజలందరూ ఇకపై రేషన్ డిపోల వద్ద ప్రతి రోజూ రేషన్ సరకులను తీసుకోవచ్చని కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. ఆదివారం సాగర్‌నగర్ 8వ వార్డులోని రేషన్ డిపో వద్ద సరకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతిరోజు నిర్దేశించిన సమయాల్లోనే సరకుల పంపిణీ జరుగుతుందని, ఇందులో ఎటువంటి ఇబ్బందులు ఉండవని కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దే సరకులు అందిస్తామని చెప్పారు. సరకుల పంపిణీలో ఎటువంటి అవినీతి, అవకతవకలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. ఎవరికైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డీవో సంగీత్ మాథుర్, కార్పొరేటర్ అప్పారావు, డీఎస్‌వో విజయ భాస్కరరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో కార్యకర్తలకు పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను

- నిత్యం అండగా ఉంటా
- 'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి
- పార్టీ శ్రేణులకు భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను పిలుపు

మధురవాడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త, విజయనగరం జిల్లా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) స్పష్టం చేశారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తానని పేర్కొన్నారు. ఆదివారం యండాడ లా కాలేజీ రోడ్డులో గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతిన హనుమంతురావు అధ్యక్షతన నిర్వహించిన జీవీఎంసీ 5, 6, 7, 8, 98 వార్డుల ముఖ్య నాయకులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి పార్టీ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గెలుపోటములు సహజం, కార్యకర్తే వెన్నెముక

రాజకీయాల్లో గెలుపు ఓటములు, ఒడిదుడుకులు సహజమని మజ్జి శ్రీనివాసరావు అన్నారు. అధికారం ఉన్నప్పుడు ప్రజలతో కలిసి పనిచేశామని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల కోసం పనిచేస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో పార్టీకి కార్యకర్తే వెన్నెముక అని, వారికి అన్ని అంశాల్లో ప్రముఖమైన ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా పనిచేయడానికి అందరూ సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేద్దాం

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎక్కడా నెరవేర్చిన దాఖలాలు లేవని, ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. ప్రజలకు ఇంటింటికీ రేషన్ అందించే పద్ధతిని రద్దు చేసి మళ్లీ పాత పద్ధతిలో ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేస్తున్న మోసాలకు వ్యతిరేకంగా ఈ నెల 4వ తేదీన 'వెన్నుపోటు దినం' నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. దీనిని దిగ్విజయం చేసి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 4వ తేదీ ఉదయం 9 గంటలకు భీమిలి ఫుట్‌బాల్ గ్రౌండ్‌కు అందరూ బైకులతో చేరుకోవాలని, అక్కడి నుంచి వైఎస్సార్ విగ్రహం, బస్టాండ్, గంట స్తంభం మీదుగా ర్యాలీగా వెళ్లి ఆర్‌డీవో కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం సమర్పిస్తామని వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, వార్డుల అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి, బొట్ట అప్పలరాజు, భీమిలి ఎంపీపీ వాసు రాజు, మాజీ స్టేట్ డైరెక్టర్ బిందాం పద్మావతి, చెన్నాదాసు, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, వంకాయల మారుతీ ప్రసాద్, పిళ్లా సూరిబాబు, కుడితి రామారావు, వాండ్రాసి రవి కుమార్, చేకూరి రజని, జగ్గుపిల్లి నరేష్, పెంట్ర అప్పన్న, బంగారు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిన్న శ్రీను తదితరులు

హరేకృష్ణ వైకుంఠంలో ముగిసిన 'సంస్కృతి శిబిరం'



శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో పాల్గొన్న సంస్కృతి శిబిరం విద్యార్థులు



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు



రామాయణంలో బంగారు లేడి ఇతివృత్తాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 21 రోజుల వేసవి శిక్షణ శిబిరం 'సంస్కృతి శిబిరం' ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసింది. ఈ శిబిరంలో 6 నుంచి 15 ఏళ్ల వయస్సు గల 60 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గత నెల 12వ తేదీన ప్రారంభమైన ఈ శిబిరంలో చిన్నారులకు భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను తెలియజేసేలా పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. సంకీర్తనలు, శ్లోక పఠనం, నాటకాల ప్రదర్శన, చిత్రలేఖనం, కథలు చెప్పడం, ఆధ్యాత్మిక ఆటలలో వీరికి సమగ్ర శిక్షణ అందించారు.

ఆధ్యాత్మిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న చిన్నారులు

ప్రతి ఆదివారం హరేకృష్ణ వైకుంఠంలో జరిగే శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో భాగంగా, సంస్కృతి శిబిరంలో శిక్షణ పొందిన చిన్నారులు తాము నేర్చుకున్న విద్యను ప్రదర్శించారు. రామాయణం, మహాభారతం, భాగవతం వంటి పవిత్ర ఇతిహాసాల నుంచి రెండు గంటల పాటు ప్రదర్శనలు ఇచ్చి ఆహుతులను ఆకట్టుకున్నారు. చిన్నతనంలోనే చిన్నారులు కనబరచిన ఆధ్యాత్మిక ప్రతిభను, వారి అంకితభావాన్ని చూసి కార్యక్రమానికి హాజరైన అతిథులు ఎంతగానో అభినందించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని పరిరక్షించడంలో శ్రీకృష్ణ అర్పణం, సంస్కృతి శిబిరం వంటి కార్యక్రమాలు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొన్న చిన్నారులను, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు అంబరీష దాస సహాయ సహకారాలు అందించారని నిర్వాహకులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ భీమిలి మండల సమావేశం రేపు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి మండల కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు టి.నగరపాలెం సర్వీస్ రోడ్డులోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో జరగనుంది. భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావుతో తొలిసారిగా జరగనున్న ఈ మండల స్థాయి సమావేశానికి ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ వార్డు సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని మండల పార్టీ అధ్యక్షుడు గాడు శ్రీను కోరారు.

రజకవీధిలో అధ్వానంగా డ్రైనేజీలు



వలందపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వెనుక డ్రైనేజీ దుస్థితి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్, రెండో వార్డు పరిధిలోని వలందపేట రజకవీధిలో అధ్వానంగా మారిన డ్రైనేజీ వ్యవస్థతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కాలం నాటి పాత పిల్ల కాలువలు పూర్తిగా శిథిలమై, రహదారులతో కలిసిపోవడంతో మురుగునీరు పారుదల నిలిచిపోయిందని, పారిశుద్ధ్య లోపంతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 200 కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామంలో మురుగునీరు రోడ్లపైనే నిలిచిపోవడంతో దోమల బెడద, దుర్వాసన వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా, డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడిక తీయకపోవడం వల్ల పారిశుద్ధ్య పనులు అస్తవ్యస్తంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. ఈ పరిస్థితిపై జీవీఎంసీ అధికారులు తక్షణమే దృష్టి సారించి, సమస్యను పరిష్కరించాలని వలందపేట రజక వీధి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



వలందపేట సర్వీస్‌రోడ్డులో డ్రైనేజీ పరిస్థితి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

తగరపువలస: మండల పరిధిలో ఆదివారం ఉదయం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. సంగివలసలో జరిగిన ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా, తాళ్లవలస వద్ద జరిగిన మరో ప్రమాదంలో బెల్లాన రాంజీ అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సంగివలసలోని ముగ్గురు అమ్మవార్ల ఆలయం ఎదురుగా ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పార్వతీపురం మన్యం జిల్లా బలగుడబకు చెందిన బోను తిరుపతి తీవ్రంగా గాయపడ్డారు. జీవీఎంసీ భీమిలి జోన్ వలందపేటలోని తన కుమార్తె ఇంటికి వచ్చిన తిరుపతి, తిరిగి ఇంటికి వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉన్నారు. అదే సమయంలో గాజువాక నుంచి తగరపువలస వైపు వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం ఆయనను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తిరుపతికి ఎడమ కాలు, ఎడమ చేయి విరిగిపోయాయి. వెంటనే క్షతగాత్రుడిని సంగివలసలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

తాళ్లవలస వద్ద ఆటో ఢీకొని..: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ వద్ద సర్వీస్ రోడ్డులో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో బెల్లాన రాంజీ అనే ద్విచక్ర వాహనదారుడు గాయపడ్డాడు. రాజు అనే వ్యక్తి నడుపుతున్న ఆటో, రాంజీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్రవాహనం ఆటో కిందకు దూసుకుపోయింది. ఈ ప్రమాదం సందర్భంగా రాంజీపై దాడి కూడా జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. భీమిలి పోలసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.